క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం 4వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో మద్దూరు మండల జేఏసీ నాయకులు పాల్గొన్నారు. వీరికి విశ్రాంత ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

'మహాధర్నాకు తరలిరండి'

చేర్యాల(సిద్దిపేట): కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ గుడి ఆవరణలో పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు బుచ్చిరాములతో కలిసి మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎంజేపీలో క్రీడలు

దౌల్తాబాద్(దుబ్బాక): లక్ష్యసాధనలో విద్యార్థినులు ముందుకు సాగాలని మండల విద్యాధికారి బండి నర్సవ్వ, పీడీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండలపరిధిలోని లింగరాజుపల్లి ఎంజేపీ గురుకుల పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలికలకు మండలస్థాయిలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గిరిజన బాలుర గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్-14లో ప్రథమ స్థానంలో గెలుపొందారు. గురువారం ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి విద్యార్థులు, పీఈటీ, పీడీలను అభినందించారు. వివిధ క్రీడా పోటీల్లో 16 మంది జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

నూతన నియామకం

దుబ్బాకటౌన్: నూతనంగా ఏర్పడిన అక్బర్‌పేట- భూంపల్లి మండల బీజేపీ అధ్యక్షుడిగా బొప్పాపూర్‌కు చెందిన సీనియర్ నాయకుడు అరిగె కృష్ణను నియమించారు. ఈమేరకు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు నియామకపత్రం అందించారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు.

అవగాహన ఒప్పందంపై సంతకాలు



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయం (ఎస్‌కెఎల్‌టీఎస్‌హెచ్‌యూ) న్యూఢిల్లీకి చెందిన ధనూక అగ్రిటెక్ లిమిటెడ్ మధ్య గురువారం పరస్పర సహకార అవగాహన ఒప్పందం కుదిరింది. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ ప్రభాకర్, ధనూక అగ్రిటెక్ లిమిటెడ్ నేషనల్ సేల్స్ అధికారి అభిషేక్ ధనుక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పరిశోధనా రంగాల్లో పరస్పర సహకారంతో ఇతర ఏజెన్సీలను ప్రొత్సహించడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీల అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాసన్, పరశురామయ్య పాల్గొన్నారు.

'హుస్నాబాద్ టికెట్ ఇప్పించండి'

బెజ్జంకి(సిద్దిపేట): హుస్నాబాద్ అసెంబ్లీ టికెట్ ఇప్పించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను గురువారం ఆపార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి కోరారు. ఇటీవల హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అజయ్‌వర్మ, ఎంపీటీసీ కొలిపాక రాజు, బుర్ర మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా

- కబ్జా కోరల్లో సర్కారు భూమి
- రెచ్చిపోతున్న భూ బకాసురులు

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ బకాసురులు రెచ్చిపోతున్నారు. ఖాళీ జాగా కన్పిస్తే చాలు పాగా వేసేస్తున్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని ఏనేశివారులోని ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే యంత్రాల సహాయంతో చదును చేస్తున్నారు. ఇక్కడ దాదాపు 620 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. విడతల వారీగా పంపిణీ చేయగా ఇంకా సుమారు 182 ఎకరాలకుపైగా ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే భూములకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

కబ్జాకు యత్నం

అక్కన్నపేట మండలానికి ఇటీవలే గిరిజన బాలికల గురుకుల కళాశాల మంజూరైంది. ఈక్రమంలో నెల క్రితం రెవెన్యూ అధికారులు, సర్వేయర్, ప్రజాప్రతినిధులు కలిసి ఏనేశివారులో దాదాపు 15 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని గుర్తించారు. దీనికి అనుకొని ప్రధాన రహదారి పక్కనే దాదాపు ఎకరా భూమి ఉంది. ఒకరిద్దరూ కలిసి జేసీబీ సహాయంతో వృక్షాలను తొలగించి భూమిని చదును చేయించారు. ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి చదును చేస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా.. జేసీబీతో అక్కడి నుంచి జారుకున్నారు.



అక్కన్నపేట ఏనేశివారులో జేసీబీతో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న దృశ్యం

"చర్యలు తీసుకుంటాం



మండలంలోని ఏనేశివారులో ప్రధాన రహదారి పక్కనే కబ్జాకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చింది. కబ్జా చేసిన చోట ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌కు చెప్పాం. విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసులు నమోదు చేయిస్తాం. – సంజీవ్‌కుమార్, తహసీల్దార్ అక్కన్నపేట

ఆరోగ్య రక్షణకు 'రుతుప్రేమ'

సిద్దిపేటజోన్/ ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళల ఆరోగ్యం కోసమే రుతుప్రేమ కార్యక్రమం చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గురువారం 13 వార్డులో డాక్టర్ శాంతితో కలిసి రుతుప్రేమపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 400 మంది మహిళలు, యువతులకు క్లాత్ ప్యాడ్స్, కప్పులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే సానిటరీ ప్యాడ్స్‌తో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. స్టీల్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని.. తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే 2వ వార్డు పరిధిలోని నర్సాపూర్‌లో డాక్టర్ శాంతి మహిళలకు నెలసరిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాయిని చంద్రం, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలకు నెలసరి కప్పుల పంపిణీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తొగుట: అంగన్‌వాడీల దీక్షలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక: అంగన్‌వాడీల మానవహారం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన దీక్షకు గురువారం సంఘీబావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం, గుడికందుల, ఎల్లారెడ్డిపేట గ్రామాల ఉపసర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, నాయకులు భిక్షపతి, స్వామిరెడ్డి, కర్నాకర్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు సరికాదు

దుబ్బాకటౌన్: డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు గురువారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి పద్మ మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేపడుతుంటే ప్రభుత్వం బెదిరింపులకు గురిచేయడం దారుణమన్నారు.

వీఓఏలకు బాధ్యతలు

దౌల్తాబాద్(దుబ్బాక): అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు ఇబ్బంది తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు గురువారం గ్రామ వీఓఏలు అంగన్‌వాడీ సెంటర్లలో విధుల్లో చేరారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, పంచాయతీ కార్యదర్శులు పలు సూచనలు చేశారు. అలాగే మండల కేంద్రంలో అంగన్‌వాడీల నిరవధిక సమ్మె కొనసాగుతుంది.

'ఇందూరు'లో సెల్ఫ్ సెంటర్



జేఎన్‌టీయూహెచ్ వీసీతో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్

సాక్షి ఎఫెక్ట్..

సిద్దిపేటఅర్బన్: ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సెల్ఫ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు జేఎన్‌టీయూహెచ్ వీసీ అంగీకరించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. కళాశాలకు చెందిన బీటెక్ ఫస్టియర్ విద్యార్థులు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ చైతన్య ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్ష రాసి తిరిగి సిద్దిపేటకు వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సెల్ఫ్ సెంటర్ సిద్దిపేటలో ఉంటే విద్యార్థులు ప్రాణాలు కోల్పోయే వారు కాదని 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు గురువారం ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నరసింహారెడ్డిని కలిసి దుర్ఘటనను వివరించి సెల్ఫ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరగా ఆయన అంగీకరించారు. ఈనెల 19వ తేదీ నుంచి జరిగే యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలన్నీ ఇందూర్ కళాశాలలో నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

సిద్దిపేటను చూసి నేర్చుకోవాల్సిందే..

రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

సిద్దిపేటజోన్/సిద్దిపేటరూరల్: సిద్దిపేటకు ఎప్పుడూ వచ్చిన ఏదో ఒకటి నేర్చుకోవాల్సిందేనని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి అన్నారు. గురువారం ఆమె సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రైతు బజార్, బుస్సాపూర్ డంప్‌యార్డ్, బయోగ్యాస్ ప్లాంట్, స్లాటర్ హౌస్‌ను సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మార్కెట్‌లో అందుతున్న సేవలు, క్రయవిక్రయాలపై ఆరా తీశారు. అనంతరం రైతు బజార్‌ను సందర్శించి వసతులపై ఆరా తీశారు. రైతు బజార్‌లో ఉన్న బయోగ్యాస్ ప్లాంట్ సేవలను 15 రోజుల్లో పునరుద్ధరణ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం బుస్సాపూర్ డంప్ యార్డులో తడి చెత్త ద్వారా గ్యాస్ ఉత్పత్తి జరగడం బాగుందని పేర్కొన్నారు. మంత్రి హరీశ్‌రావు ముందు చూపుతో తీసుకునే ప్రక్రియ సత్ఫలితాలు ఇస్తుందని పేర్కొన్నారు. ఆమె వెంట అడిషనల్ డైరెక్టర్ లక్ష్మణ్, డిప్యూటీ డైరెక్టర్ పద్మశ్రీ ఉన్నారు.



బుస్సాపూర్ డంప్‌యార్డును పరిశీలిస్తున్న లక్ష్మీబాయి తదితరులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చేర్యాల: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/ కొమురవెల్లి(సిద్దిపేట): పట్టణకేంద్రంలోని 12వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీరెడ్డి గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే దూల్మిట్ట మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ పుష్పలత ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట, మర్రిముచ్చాల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావని పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

దుబ్బాక: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని దుబ్బాక బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని, రానున్న రోజుల్లో నిరుద్యోగులు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, శ్రీనివాస్, వంశీ, రమణారెడ్డి, రవి, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్ పట్టణంలో..

గజ్వేల్‌రూరల్: ఉద్యోగాల కల్పనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా పోరాటం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో వారు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు రాములు, మనోహర్ యాదవ్, అశోక్‌గౌడ్, వెంకట్‌గౌడ్, మహేష్‌చారి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్(దుబ్బాక): నిరుద్యోగులను సీఎం కేసీఆర్ మోసం చేశారని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పోతరాజు కిషన్ మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాస్, అనిల్‌రెడ్డి, అంజి, సత్యం, సుచిత్‌గౌడ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి

దుబ్బాకరూరల్: పేదలకు భూ పంపిణీ చేయకుండా, భూసంస్కరణలు అమలు పరచకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సామాజిక పరివర్తన బృందం నేతలు డాక్టర్ కుమార్, శంకర్ మండిపడ్డారు. గురువారం అక్బర్‌పేట- భూంపల్లి మండలం ఎనగుర్తి, బొప్పాపూర్, దుబ్బాక మండలంలోని ఆకారం, రఘోత్తంపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. యువత చదువుతో పాటు చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఎస్ నేత సురేందర్‌సింగ్, డీబీఎఫ్ నాయకులు సంజీవ్, ఏగొండస్వామి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

రాయపోలు(దుబ్బాక): అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. రాయపోలు మండల కేంద్రంలో ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఓటరు నమోదు, సవరణలు, చిరునామా మార్పునకు అందిన దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. ఆమెతో పాటు గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ దివ్య, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దోమల మందు పిచికారీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో ఓ విద్యార్థి డెంగీ బారిన పడడంతో అప్రమత్తమైన పంచాయతీ పాలకవర్గం గురువారం గ్రామంలో దోమల మందు పిచికారీ చేసింది. అలాగే ఇటిక్యాల గ్రామంలో రోడ్లు, మురికి కాల్వల వెంట దోమల మందు పిచికారీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు లక్ష్మి, చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సత్యం, హరి, తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్‌లో గురువారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, వైద్యులు పాల్గొన్నారు.

◆ నిధులు మంజూరు చేయండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పలుగుగడ్డ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం సర్పంచ్ రాజేశ్వరీ రవి మంత్రి హరీశ్‌రావును తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు.

◆ క్షీరాభిషేకం

కొండపాక(గజ్వేల్): మండలంలోని వెలికట్ట గ్రామాభివృద్ధి, కుల సంఘ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 2.77 కోట్లు మంజూరు కావడంపై గురువారం సర్పంచ్ అమ్ముల రమేష్ ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ దుర్గయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్, ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ మెడికల్ కాలేజీల ఏర్పాటు హర్షణీయం

మర్కూక్(గజ్వేల్): అన్ని జిల్లాల్లో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం హర్షణీయమని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో నిరుపేదలకు వైద్యం చేరువ అవుతుందని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు మెడికల్ కళాశాలలో చేరేందుకు అనువుగా ఉంటుందన్నారు. మండల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

◆ ఎన్నిక ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): కొండపాక మండల జర్నలిస్టు సంఘం ఎన్నికలు గురువారం ఏకగ్రీవం అయ్యాయి. మండలంలోని దుద్దెడలో గల ఎల్లమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా నిమ్మ నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా గోనె రమేష్, కుసుంభ శ్రీనివాస్‌రావు, తదితరులు ఎన్నికయ్యారు.

◆ తాగునీటి సమస్యను పరిష్కరించాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేటలోని ఒక కాలనీలో ఏర్పడిన తాగునీటి సమస్యను పరిష్కరించకపోవడం శోచనీయమని బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దాల శ్రీనివాస్ గురువారం ఆరోపించారు.

◆ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంతో పాటు పెద్దతండాలో గురువారం కాంగ్రెస్ తలపెట్టిన విజయభేరి సభ వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గుగులోతు రాంబాబునాయక్, నాయకులు ఎల్లయ్య, త్రిమూర్తి, రవి, తదితరులు పాల్గొన్నారు.

◆ ప్లేట్ల పంపిణీ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లిలో 150 మందికి స్వచ్ఛంద సంస్థ భోజన ప్లేట్లు అందించగా వాటిని సర్పంచ్ దేవసాని సుశీల గురువారం పంపిణీ చేశారు.

◆ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తిలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో గురువారం కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ డాకూరి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ పాల్గొన్నారు.

◆ సమయానికి బస్సులు నడపండి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారం నుంచి కళాశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సును నడపాలంటూ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య గురువారం విద్యార్థులతో కలిసి గజ్వేల్- ప్రజ్ఞాపూర్ డిపో కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.

◆ కారు ఢీ: వ్యక్తికి తీవ్ర గాయాలు

కొండపాక(గజ్వేల్): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్ల పెట్రోల్ బంక్ వద్ద రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుకునూరుపల్లి మండలంలోని పీటీ వెంకటాపూర్‌కు చెందిన పెర్క సత్తయ్య ద్విచక్ర వాహనంపై కొడకండ్ల పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు వెళ్తున్న క్రమంలో చేర్యాల నుంచి హైదరాబాద్‌కు వెలుతున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో ఆయన కుడి కాలు విరగడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటాం

గజ్వేల్‌రూరల్: అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్‌ఎస్‌కు అండగా ఉంటామని మండల పరిధిలోని సింగాటం గ్రామానికి చెందిన గౌడసంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈసందర్భంగా గురువారం గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించి మూడోసారి అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ గౌడసంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్టీసీ బిల్లు ఆమోదంపై హర్షం

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును గవర్నర్ ఆమోదించడం హర్షనీయమని నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మౌలానా గురువారం పేర్కొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ పిల్లలను సన్మార్గంలో పెంచాలి

సిద్దిపేటకమాన్: పిల్లలను చిన్నప్పటి నుంచి సన్మార్గంలో పెంచడం ఎంతో ముఖ్యమని సరస్వతీ విద్యాపీఠం మాతృమండలి సభ్యులు అనిత అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడుతూ.. సిద్దిపేటలోని కొండ భూదేవి గార్డెన్‌లో ఈనెల 17న వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు.

◆ హిందీ భాషా దినోత్సవం

నంగునూరు(సిద్దిపేట): హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నంగునూరు ఉన్నత పాఠశాలలో హిందీ భాష ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.